అనంతపురం కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న సిఐటియు నాయకులు

చెరువులు ఖాళీ..!

◆ మూడొంతులు నీళ్లు లేవు..
◆ మూడు చెరువుల్లోనే నిండుగా..
◆ తగ్గుతున్న నీటి నిలువ



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఉమ్మడి అనంతపురం జిల్లాలో మూడొంతులు ఖాళీ చెరువులు దర్శనమిస్తున్నాయి. వర్షాభావం ప్రభావంతో రోజురోజుకూ నీటి నిలువలు తగ్గిపోతున్నాయి. గతేడాది మంచి వర్షాలు రావడంతో పుష్కలంగా నీటి జాడ జిల్లాలో కనిపించింది. ఈ ఏడాది సీజన్ ప్రారంభం నుంచి నెలకొన్న వర్షాభావంతో నీటి నిలువలు తగ్గిపోతున్నాయి. సెప్టంబర్ మాసం ప్రారంభంలో కొంత వర్షం పడినప్పటికీ సీజన్ మొత్తంగా పడాల్సినంత వర్షపాతం నమోదవ లేదు.

4.06 టిఎంసిలే మిగులు

అనంతపురం జిల్లాలో జూన్ ప్రారంభం నుంచి ఇప్పటి వరకు వర్షాల మూలంగా పడిన వర్షపాతం 58.96 టిఎంసిలు. అందులో 9.89 టిఎంసిలు నీరు భూగర్భ జలాలుగా మారింది. 6.57 టిఎంసిలు తేమ రూపంలో ఉంది. 43.6 టిఎంసిలు ఆవిరి రూపంలో పోయింది. మొత్తంగాపోనూ నాలుగు టిఎంసిల వరకే నీరు నిలువుంది.

మూడొంతుల చెరువులు ఖాళీ

ఉమ్మడి అనంతపురం జిల్లాలో 1484 చెరువులున్నాయి. వీటిల్లో మూడు చెరువుల్లోనే నీరు పూర్తి స్థాయిలోనున్నాయి. 11 చెరువుల్లో 75 శాతం నీరుంది. ఇక 115 చెరువుల్లో 50 శాతం నీరుంది. 396 చెరువుల్లో 25 శాతం మాత్రమే నీరుంది. ఇక మిగిలిన 975 చెరువుల్లో చుక్కనీరు లేదు. అంటే మొత్తం చెరవుల్లో 65 శాతం ఖాళీగానే ఉన్నాయి. గతేడాది వర్షాలు పడి దాదాపు ఎక్కువ శాతం చెరువుల్లో నీరు పుష్కలంగా చేరి ఎక్కడ చూసినా జలకళ కనిపించేది. ఈ ఏడాది వర్షాభావం కారణంగా నీరు అడుగంటిపోతోంది. చెరువులు ఒక్కొక్కటిగా ఖాళీగా దర్శనమిచ్చే పరిస్థితులు నెలకొన్నాయి.

ఇప్పటికీ కొనసాగుతన్న వర్షాభావం

ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఇప్పటికీ వర్షాభావ పరిస్థితులే కొనసాగుతున్నాయి. సెప్టంబర్‌లో ఒక మోస్తరు వర్షం నమోదయినప్పటికీ మండలాల వారీగా చూసినా, జిల్లల వారీగా చూసినా లోటు స్పష్టంగా కనిపిస్తోంది. అనంతపురం జిల్లాలో సాధారణ వర్షపాతం 246.4 మిల్లీమీటర్లకుగానూ పడింది 185.5 మిల్లిమీటర్లు. 24.7 శాతం వర్షపాతం లోటుంది. ఇక సత్యసాయి జిల్లాలో సాధారణ వర్షపాతం 278.4 మిల్లీమీటర్లకుగానూ 182.4 మిల్లిమీటర్లు నమోదయింది. సాధారణం కంటే 34.5 శాతం వర్షపాతలోటుంది. మండలాల వారీగా చూస్తే 31 మండలాలకుగానూ అనంతపురం జిల్లాలో 21 మండలాల్లో వర్షాభావ పరిస్థితులున్నాయి. సత్యసాయి జిల్లాలో 32 మండలాలకుగానూ 24 మండలాల్లో వర్షాభావం ఉంది. అందులో నాలుగు మండలాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. వర్షాలు లేకపోవడంతో వేసిన కొద్ది పాటి పంటకూడా ఎండిపోతోంది. దీంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కార్మికుల వేతనాలు కాజేయడం దుర్మార్గం

◆ బోగస్ పేర్లతో దోచుకున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి
◆ శ్రీరామిరెడ్డి కార్మికులకు బకాయి వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

కష్టపడి పని చేసిన కార్మికులకు ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం వేతనాలు ఇవ్వకుండా కాంట్రాక్టర్ కోతలు విధించి ఆ డబ్బులు కాజేయడం దుర్మార్గం అని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు మండిపడ్డారు. ఉమ్మడి అనంతపురం జిల్లా నీలకంఠాపురం శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో అనంతపురం కలెక్టరేట్, ఆర్‌డబ్ల్యుఎస్ కార్యాలయాల ఎదుట మంగళవారం ఉదయం ధర్నా నిర్వహించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.నాగేంద్రకుమార్ అధ్యక్షతన నిర్వహించిన ధర్నాకు సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని నీలకంఠాపురం శ్రీరామ్‌రెడ్డి తాగునీటి పథకంలో పని చేస్తున్న హిందూపురం, మడకశిర డివిజన్‌లోని కార్మికులకు 5 నెలలుగా వేతనాలు బకాయిపడ్డాయన్నారు. 14 నెలల పిఎఫ్, ఇఎస్‌ఐ చెల్లించకపోవడం దుర్మార్గంగా ఉందన్నారు. కాంట్రాక్టర్ కలాం నాయుడు 120 మంది కార్మికుల వేతనాల్లో మూడు సంవత్సరాల పాటు రూ.2500 వేతనాల్లో కోతలు విధించి కార్మికుల సొమ్ము కాజేశాడన్నారు. 3 సంవత్సరాలుగా 120 మంది బోగస్ కార్మికులను సృష్టించి ఒక్కొక్కరి పేరు మీద నెలకు రూ.15 వేల చొప్పున చెల్లించినట్లు తప్పుడు లెక్కలు చూపించి ప్రభుత్వం నుంచి దోచుకున్నారని తెలిపారు. ప్రభుత్వ అధికారులు విచారణ జరిపించి 19 మంది కార్మికుల పేర్లతో వేతనాలు కాజేసినట్లు తేల్చారన్నారు. వాస్తవానికి 120 మంది బోగస్ కార్మికుల పేర్లతో నెలనెలా వేతనాలు చెల్లించినట్లు చూపించి కాంట్రాక్టర్ కాజేశాడన్నారు. 120 మంది కార్మికులకు 3 సంవత్సరాల పాటు చెల్లించిన వేతనాలు లెక్కిస్తే రూ.6.48 కోట్లు అవుతుందన్నారు. అధికారులు మాత్రం 19 మంది బోగస్ కార్మికుల పేర్లతో కాజేసినట్లు తేల్చారన్నారు. ధర్నాపై కూడా ఇంత వరకు అధికారులు ఎలాంటి చర్యలూ తీసుకోలేదన్నారు. ఈ అవినీతి అక్రమాల్లో ఆర్‌డబ్ల్యుఎస్ అధికారుల పాత్ర కూడా ఉందన్న విమర్శలు ఉన్నాయన్నారు. ఎస్ఎస్ఆర్ రేట్లతో కాకుండా కోతలు విధించి కాంట్రాక్టర్ వేతనాలు చెల్లిస్తుంటే అధికారులు ఎందుకు ప్రశ్నించలేదన్నారు. వేతనాల్లో కోతలు విధించిన కాంట్రాక్టర్ కలాం నాయుడుపై క్రిమినల్ కేసు నమోదు చేసి ఆ డబ్బులను ఆయన నుంచి రికవరి చేసి కార్మికులకు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇందులో ఆర్‌డబ్ల్యుఎస్ అధికారుల పాత్రపై కూడా విచారణ జరిపించాలన్నారు. అక్రమాలకు పాల్పడిన కాంట్రాక్టర్ కలాం నాయుడు కాంట్రాక్ట్ లైసెన్స్‌ను బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలన్నారు. కార్మికుల బకాయి పడ్డ 5 నెలల వేతనాలు, 15 నెలల పిఎఫ్ చెల్లించాలన్నారు. శ్రీసత్యసాయి జిల్లా శ్రీరామ్‌రెడ్డి కార్మికులకు వేతనాలు పెంచాలన్నారు. వేతనాలు చెల్లించేప్పుడు ఇఎస్‌ఐ, పిఎఫ్ చెల్లించాలన్నారు. అనంతపురం కలెక్టర్ ఎం.గౌతమిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ్‌రెడ్డి కార్మికుల యూనియన్ నాయకులు సుబ్బరాజు, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ మేనేజర్‌కు వినతిని ఇస్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు

సమస్యలు పరిష్కరించాలి : సిఐటియు

ప్రజాశక్తి-హిందూపురం

పురపాలక సంఘంలో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిఐటియు పట్టణ కార్యదర్శి నరసింహప్ప డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించాలన్న డిమాండ్‌తో పారిశుధ్యకార్మికులు ర్యాలీ నిర్వహించి, మున్సిపల్ మేనేజర్ సుధాకర్‌కు వినతిని ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు పురపాలక సంఘంలో అదనపు కార్మికులుగా తీసుకున్న వారికి గత రెండు నెలల నుంచి వేతనాలు ఇవ్వలేదన్నారు. వీరితో పాటు క్లాప్ ఆటో డ్రైవర్లకు ఐదు నెలల నుంచి వేతనాలు అందలేదన్నారు. ప్రతి నెల వేతనాలు అందక పోతే కార్మికులు వారి కుటుంబాలకు ఎలా పోషించుకుంటారని ప్రశ్నించారు. ఇపిఎఫ్, ఇఎస్ఐ సమస్యలను పరిష్కరించాలన్నారు. 60 సంవత్సరాల పేరుతో తొలగించిన కార్మికుల కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు. కార్మికులకు అవసరమైన పనిముట్లు ఇవ్వాలన్నారు. లేని పక్షంలో ఈ సమస్యలపై విధులు బహిష్కరించి పెద్ద ఎత్తున పోరాటాలను చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు మల్లికార్జున, కార్యదర్శి పి జగదీష్, కోశాధికారి ఆనంద్, ఉపాధ్యక్షులు చంద్రశేఖర్, రామచంద్రప్ప, రామంజప్ప, సహాయ కార్యదర్శులు చంద్ర, మంజునాథ్, మూర్తి, గురునాథ్, కమిటీ సభ్యులు కుమార్, నారాయణమూర్తి, గంగప్ప, కృష్ణమూర్తి, రమేషు, శంకర, బాబయ్య, ఏ నాగేంద్ర, బాలాజీ, కవితమ్మ, గంగ రత్నమ్మ, శోభమ్మ, ఓబులమ్మ, సుబ్బలమ్మ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు కోసం పోరాటం

◆ నేటి నుంచి నిరవధిక దీక్షలు
◆ జగన్ కుట్రలను ప్రజలకు తెలియజేద్దాం
◆ ఉమ్మడి జిల్లా టిడిపి నేతలు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

మాజీ ముఖ్యమంత్రి, టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడుపై అక్రమ అరెస్టును నిరసిస్తూ, ఆయన విడుదల అయ్యేంత వరకు ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా నిరవధిక నిరసన కార్యక్రమాలు కొనసాగించనున్నట్లు ఆ పార్టీ ముఖ్య నాయకులు తెలిపారు. తెలుగుదేశం పార్టీ ఉమ్మడి అనంతపురం జిల్లా విస్తృత స్థాయి సమావేశాన్ని అనంతపురం బళ్లారి రోడ్డులోని ఎంవైఆర్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం నిర్వహించారు. టిడిపి హిందూపురం పార్లమెంట్ అధ్యక్షుడు బికె.పార్థసారథి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మాజీ మంత్రులు పల్లె రఘునాథ్‌రెడ్డి, పరిటాల సునీత, మాజీ ఎమ్మెల్యేలు వైకుంఠం ప్రభాకర్ చౌదరి, జితేంద్రగౌడ్, కందికుంట వెంకటప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, టిడిపి కళ్యాణదుర్గం నియోజకవర్గం ఇన్‌ఛార్జి ఉమా మహేశ్వరనాయుడు, ధర్మవరం ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్, శింగనమల ద్విసభ్య కమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు, ముంటి మడుగు కేశవరెడ్డి, హిందూపురం నియోజకవర్గం నాయకులు అంబికా లక్ష్మినారాయణ, టిడిపి అనంతపురం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌చౌదరి, మాజీ మేయర్ స్వరూప, జిల్లా గ్రంధాలయ సంస్థ మాజీ అధ్యక్షులు గౌస్‌మొద్దీన్, మాజీ జడ్పీటిసి రాంమ్మోహన్ నాయుడు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా బికె.పార్థసారథి మాట్లాడుతూ నారా చంద్రబాబు నాయుడుపై కక్ష సాధింపుతో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపారన్నారు. స్కిల్ డెవలెప్‌మెంట్ సెంటర్‌కు సంబంధించి ఎక్కడా రూపాయి కూడా అవినీతి జరగలేదన్నారు. కావాలనే జగన్మోహన్‌రెడ్డి చంద్రబాబును కేసులో ఇరికించాడని తెలిపారు. 16 నెలలు జైలు శిక్ష అనుభించిన జగన్‌మోహన్‌రెడ్డి కావాలనే చంద్రబాబును జైలుకు పంపాడని దుయ్యబట్టారు. న్యాయపోరాటంలో టిడిపి అధినేత మచ్చలేని చంద్రుడిగా, కడిగిన ముత్యంలా జైలు నుంచి బయటకు రావడం ఖాయం అన్నారు. ప్రభుత్వ కుట్రలను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రజా మద్దతుతో జగన్‌కు గుణపాఠం నేర్పాల్సి ఉందన్నారు. బుధవారం నుంచి ఉమ్మడి అనంతపురం జిల్లాలో టిడిపి ఆధ్వర్యంలో నిరవధిక దీక్షలు చేపట్టనున్నట్లు చెప్పారు. మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి మాట్లాడుతూ అధినేత అరెస్టులతో వైఎస్ఆర్‌సిపి ప్రభుత్వం రాబోయే ఎన్నికల్లో లబ్ది పొందాలనే అపోహల్లో ఉందన్నారు. వారి అనుకున్నట్లు ఏదీ జరగదన్నారు. మాజీ ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్.రాజశేఖర్‌రెడ్డి అధికారంలో రాగానే హత్యా రాజకీయాలు జరిగాయని తెలిపారు. వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలో వచ్చాక ఆర్థిక వనరులను దెబ్బతీస్తూ ప్రతిపక్షాలను ఇబ్బందులు పెట్టేందుకు చట్టాన్ని దుర్వినియోగం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ అధినేత చంద్రబాబుకు జరిగిన ఇబ్బందులపై ప్రతి నాయకుడు, కార్యకర్త బరువెక్కి హృదయంతోనే నిరసనలు తెలియజేస్తున్నారని తెలిపారు. అధినేతను విడుదల చేసేంత వరకు ఐక్యంగా పని చేద్దామన్నారు. మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప మాట్లాడుతూ మొండిగా పరిపాలన చేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డికి రాబోయే ఎన్నికల్లో గట్టి గుణపాఠం నేర్పుదామన్నారు. మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి మాట్లాడుతూ జగన్ కుట్ర రాజకీయాలకు రోజులు దగ్గర పడ్డాయని తెలిపారు. మాజీ పరిటాల సునీత మాట్లాడుతూ అధినేత విడుదల చేసేంత వరకు మహిళా పోరాడుదామన్నారు.

ఉమ్మడి అనంతపురం జిల్లా సమన్వయ కమిటీ సమావేశంలో పాల్గొన్న టిడిపి నాయకులు

ప్రతి చెరువుకూ నీరందిస్తాం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - తనకల్లు

మండలంలోని ప్రతి చెరువుకు నీరందిస్తామని ఎమ్మెల్యే డాక్టర్ పివి సిద్ధారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపిపి కౌసల్య అధ్యక్షతన మండల సర్వ సభ సమావేశం నిర్వహించారు. ఈసమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసిపి హయాంలో అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని అన్నారు. మండలానికి కోటి రూపాయలు నిధులు వచ్చాయని అన్నారు. రాచనేపల్లిలో నూతన అంగన్వాడీ భవనాన్ని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈసందర్భంగా సర్పంచులు మాట్లాడుతూ అభివృద్ధి పనులు వర్క్ చేసేందుకు ఇసుకతో ఇబ్బందిగా ఉందని ఇసుక లేకపోతే పనులు చేయలేమని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. స్పందించి ఆయన వెంటనే రెండు ఇసుక రీచ్‌లో ఏర్పాటు చేసి ఇసుక అందించాలని తహశీల్దార్‌ను ఆదేశించారు. ఈసమావేశంలో వైస్ ఎంపీపీలు రమణమ్మ, లక్ష్మీదేవి, సర్పంచి సుజాత, ఎంపీటీసీ సుబ్బలక్ష్మమ్మ, ఎంపీడీవో పూల నరసింహులుచ తహశీల్దార్ శోభ సువర్ణ, ఎపిఎం వెంకటనారాయణతో పాటు ఆయా శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

మండల స్థాయి పోటీల్లో పెనుకొండ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి -పెనుకొండ

మండలంలోని గుట్టూరు జెడ్పీహెచ్ఎస్‌లో ఎస్‌జిఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన మండల స్థాయి పోటీలలో పట్టణంలోని దుర్గా పేటకు చెందిన జడ్‌పిహెచ్ఎస్ ఉర్దూ పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనపర్చినట్లు పీడీ కృష్ణవేణి తెలిపారు. అండర్ – 17 విభాగంలో 9వ తరగతికి చెందిన నశిహ షాట్ పుట్‌లో నశిహ తృతియస్థానం, లాంగ్ జంప్‌లో రుక్సార్ ద్వితీయ స్థానం సాధించారన్నారు. అండర్ 14 విభాగంలో 9వ తరగతి చెందిన విద్యార్థి రేష్మ 400 మీటర్స్‌లో తృతియస్థానం, 200 మీటర్స్ షాంసినాజ్ తృతీయ స్థానం సాధించారన్నారు. విజేతలను పాఠశాల హెచ్ఎం గోవిందరావు ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రత్యామ్నాయ విత్తనాల కోసం తోపులాట

అధికారులతో వాగ్వాదం

ప్రజాశక్తి అమరాపురం

మండల పరిధిలోని కె శివరం అర్‌బికెలో మంగళవారం జరిగిన ఉలవలు,రాగి విత్తనాల పంపిణీలో రైతుల మధ్య తోపులాట జరిగింది. స్టాకు తక్కువగా ఉండటంతో కొద్దిమంది రైతులకు మాత్రమే సరిపోతాయని చెప్పడంతో ప్రత్యామ్నాయ విత్తనాల కోసం రైతులు ఎగబడ్డారు. దీంతో రైతుల మధ్య తోపులాట జరిగింది. తక్కువ మంది రైతులకు మాత్రమే పంపిణీ చేయడంతో రైతులు అగ్రికల్చర్ విహెచ్ఒ వీణతో వాగ్వాదానికి దిగారు. ఇస్తే అందరికీ ఇవ్వాలని లేకపోతే అందరినీ వెనక్కి పంపించాలని డిమాండ్ చేశారు. ఈసందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఆన్లైన్లో దరఖాస్తు చేసుకున్న రైతులు కార్యాలయం దగ్గరకు వచ్చారని అయితే విత్తనాలు కొంత మంది రైతులకు మాత్రమే వచ్చాయని చెప్పారు.

టిఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో వినూత్న నిరసన

ఓబులదేవర చెరువు: సిల్క్ డెవలప్మెంట్ కేసులో చంద్రబాబు అక్రమఅరెస్టు కుట్ర పూరితమంటూ ఒడిసి మండల కేంద్రంలో టిఎన్ఎస్ఎఫ్ నాయకులు బుధవారం వినూత్న నిరసన వ్యక్తం చేశారు. అంబేద్కర్ విగ్రహనికి పూలమాల వేసి సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ కళ్లకు నల్ల బ్యాడ్జ్ కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం నాలుగున్నర సంవత్సరాల నుంచి చంద్రబాబు నాయుడు, లోకేష్‌ను ఏ కేసులో ఇరికిద్దామా అని కుట్రలు పడుతోందన్నారు. చంద్రబాబు నాయుడికి రాష్ట్ర ప్రజల్లో పెరుగుతున్న ఆదరణ మద్దతు చూసి జగన్మోహన్ రెడ్డికి వెన్నులో వణుకు పుడుతుందని విమర్శించారు. వైసిపి కక్షపూరిత రాజకీయాలకు ప్రజలే గుణపాఠం చెప్తారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రామాంజులు నాయుడు, మండల కన్వీనర్ జయచంద్ర, ప్రధాన కార్యదర్శి సుధాకర్ టిఎన్‌టియుసి నిజాం, చాకివేలు శ్రీనివాసులు, సర్పంచి నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

అఖిలపక్ష నాయకులతో సమావేశం

పుట్టపర్తి రూరల్: అఖిలపక్ష నాయకులతో రెవిన్యూ డివిజనల్ అధికారి భాగ్యరేఖ తన కార్యాలయంలో కార్యాలయంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డివిజనల్ పరిపాలన అధికారి జిలానీ, పుట్టపర్తి తహశీల్దార్ నవీన్ కుమార్, ఒడిసి తహశీల్దార్ రామనాథరెడ్డి, మనోజ్ కుమార్, డి. టి, హరి క్రిష్ణ, తరుణ్ కుమార్, రహీమాన్ , చెరువు భాస్కర్ రెడ్డి, వైసిపి, బిఎస్‌పి, సిపిఐ, బిజెపి, కాంగ్రెస్, జనసేన నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ఈ సర్వే లో 18 సంవత్సరాలు నిండిన యువతి, యువకులు ఓటర్లుగా తమ పేరు నమోదు చేసుకోవచ్చని చెప్పారు. బిఎల్ఓల దగ్గర, ఆన్‌లైన్‌ద్వారా గాని దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. డబుల్ ఓటర్లు, చనిపోయిన ఓటర్లు, శాశ్వతంగా వలస వెళ్లిన వారిని నిబంధనలు మేరకు తొలగిస్తున్నామన్నారు.

ఎన్ఎంయుకు ప్రభుత్వ గుర్తింపు

కదిరి టౌన్ : నేషనల్ మజ్దూరు యూనియన్‌కు ప్రభుత్వ గుర్తింపు లభించింది. ఈ మేరకు సెక్రటరేట్ లో డిప్యూటి సెక్రటరీ నాగమణి చేతుల మీదుగా గుర్తింపు పత్రాన్ని యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పివి.రమణా రెడ్డి, వై.శ్రీనివాసరావు అందుకున్నారు. ఈ మేరకు ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం చేస్తామని నాయకులు హరిమోహన్, ఎన్‌వి.రమణ తెలిపారు.

తప్పుల్లేని ఓటరు జాబితా రూపకల్పన

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

జిల్లాలో ప్రత్యేక ఓటర్ జాబితా సంక్లిప్త సవరణకు కృషి చేస్తున్నామని జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు తెలిపారు. ఓటరు జాబితాపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా కలెక్టర్లతో మంగళవారం విజయవాడ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ పాల్గొన్నారు. ఈసందర్భంగా జిల్లాలో జరిగే విధానాన్ని ఉన్నతాధికారులకు విన్నవించారు. జిల్లాలో ఇంటింటికి వెళ్లి ఓటరు జాబితా పై దాదాపుగా సర్వే పూర్తయిందన్నారు. అభ్యంతరాలు, మృతి చెందిన వారి క్లైములు, పరిశీలించి తప్పులు లేని ఓటర్ జాబితాను రూపొందించడానికి తగిన కృషి చేస్తున్నామన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఎప్పటికప్పుడు సమాచారం ఇస్తూ, సమావేశాలు నిర్వహించడం జరిగిందని అన్నారు. ఒకే ఓటు పలుచోట్ల నమోదు కావడంపై చర్యలు తీసుకుంటామని వీఆర్వోలు, బిఎల్ఒలు స్వీకరించిన ఫారాలను ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు పరిష్కరిస్తున్నామని చెప్పారు. అనంతరం కలెక్టర్ రెవిన్యూ డివిజన్ అధికారులతో మాట్లాడుతూ ఇంటింటి ఓటరు సర్వే పై ఎలాంటి సందేహాలు, సమస్యలు ఎదురైన తన దృష్టికి తేవాలని అధికారులను ఆదేశించారు. ఇంటింటి సర్వే ఈనెల 15లోగా పూర్తి చేయాలన్నారు. ముఖ్యంగా ఆర్డీవోలు క్షేత్రస్థాయిలో పర్యటించి పోలింగ్ కేంద్రాలను కచ్చితంగా తనిఖీ చేసి అవసరమైన మేరకు ఆ కేంద్రాలను భవన పరిస్థితులు, మౌలిక సదుపాయాలు కల్పనపై దృష్టి పెట్టాలన్నారు. అక్కడ ఉన్న సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తిక్, డిఆర్ఒ కొండయ్య, ఆర్‌డిఒలు, పుట్టపర్తి భాగ్యరేఖ, కదిరి రాఘవేంద్ర, ధర్మవరం ఆర్డీవో తిప్పేనాయక్, ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ తదితరులు పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

టిటిడి బోర్డు మెంబర్‌కు అభినందన

ప్రజాశక్తి - కొత్తచెరువు రూరల్

తిరుమల తిరుపతి దేవస్థానం నూతన బోర్డు సభ్యునిగా ఎంపికైన అశ్వర్థ నాయక్‌ను మంగళవారం స్థానిక వైసిపి నాయకులు అభినందించారు. శ్రీ సత్య సాయి జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ అవుటాలా రమణారెడ్డి, కొత్తచెరువు వైసిపి మండల కన్వీనర్ జగన్మోహన్ రెడ్డి, కొడప గాని పల్లి సర్పంచి నరసింహారెడ్డి. అనంతపురంలోని టీటీడీ బోర్డు మెంబర్ స్వగృహం వద్ద అశ్వర్థనాయక్‌ను అభినందించారు.

ఉన్నత లక్ష్యంతో చదవండి

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యంతో చదివి భవిష్యత్తులో ఉన్నతస్థాయికి చేరుకోవాలని ఆర్టీసీ డీఎం మోతిలాల్‌నాయక్, దాత చింతామోహన్ సూచించారు. పట్టణంలోని బీఎస్ఆర్ మున్సిపల్ బాలికల,బాలుర ఉన్నతపాఠశాలలో చదువుతున్న గ్రామీణ విద్యార్థులు 300 మందికి దాత చింతారంగయ్య, కౌన్సిలర్ నీలూరి వెంకటరాముడు,ఆర్టీసీ డీఎం మోతిలాల్‌నాయక్, పాఠశాల హెచ్ఎం ఉమాపతి చేతులమీదుగా ఉచిత బస్సు పాసులను మంగళవారం పంపిణీచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు దాత చింతారంగయ్య ఉచితబస్సు పాసులు అందజేయడం అభినందనీయమన్నారు. విద్యార్థులు ఈ ఉచిత బస్సు పాసులను ఉపయోగించుకుని పాఠశాలలకు క్రమం తప్పకుండా వచ్చి పరీక్షలలో మంచి మార్కులు సాధించాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో బాలుర ఉన్నత పాఠశాల హెచ్ఎం రాంప్రసాద్, ఆర్టీసీ యూనియన్ నాయకులు కేబీ నాగార్జునరెడ్డి, బాబు, వైవీఎస్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంగవైకల్య బాలుడికి పింఛను మంజూరు

ప్రజాశక్తి పుట్టపర్తి క్రైమ్

పుట్టపర్తి పట్టణంలో హిమాచల్ ప్రదేశ్ కి చెందిన దంపతుల కుమారునికి ఎమ్మెల్యే చొరవతో వైస్ చైర్‌పర్సన్ పింఛను మంజూరు చేయించారు. హిమాచల్ ప్రదేశ్‌కు చెందిన దంపతులు 20 సంవత్సరాల క్రితం పుట్టపర్తికి వచ్చి ఇక్కడే స్థిరపడిపోయి చిరు వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అయితే వీరికి ఉన్న ఒక్కగానొక్క కుమారుడు పుట్టుకతోనే అంగవైకల్యంతో జన్మించాడు. పది సంవత్సరాల వయసు గల ఈ బాలుడి పరిస్థితిని గమనించిన ఎమ్మెల్యే పింఛను మంజూరు చేయాలని సూచించారు. దీంతో చైర్‌పర్సన్ స్పందించి పింఛను మంజూరు చేయించారు. దీంతో ఆ దంపతులు మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ కి, ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ నారాయణరెడ్డి, అవార్డు వాలంటీర్ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఎస్కెయు పాలక మండలి సభ్యునికి సన్మానం

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరి పట్టణానికి చెందిన కొమ్ము విజయభాస్కర్ ఎస్కేయు పాలకమండలి సభ్యునిగా ఎన్నికైన సందర్భంగా స్థానిక వైసిపి నాయకులు ఆయనను సన్మానించారు. మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ చిత్రపు భాస్కర్ రెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ చిత్రపు పురుషోత్తం రెడ్డి ఆధ్వర్యంలో కొమ్ము విజయభాస్కర్‌ను పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ పారుక్, సిద్ధారెడ్డి తదితరులు పాల్గొన్నారు

నేడు సంతాన సాఫల్య పరీక్షలు

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

పట్టణంలోని స్పందన హాస్పిటల్‌లో బుధవారం ఉచిత సంతాన సాఫల్య పరీక్ష శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు స్పందన హాస్పిటల్ నిర్వాహకులు డాక్టర్ బషీర్, డాక్టర్ సోనియా తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంతానం లేని వారికి ఇదొక చక్కటి అవకాశం అని అన్నారు. ప్రముఖ కన్సల్టెంట్ ఫెర్టిలిటీ స్పెషలిస్ట్ డాక్టర్. ప్రియాంక రెడ్డిచే వైద్య చికిత్సలను అందిస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని సంతానం లేని దంపతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాల కొరకు సెల్ నెంబర్ 949410055, లేదా 8500858888, లేదా 7978113533 కు సంప్రదించవచ్చునని తెలిపారు.

మండల స్థాయి క్రీడా పోటీలు

ప్రజాశక్తి - ఓబుల దేవర చెరువు

మండలకేంద్రంలో బుధ, గురువారాల్లో మండల స్థాయి పాఠశాలల క్రీడా పోటీలు, ఎంపిక నిర్వహిస్తున్నట్లు ఎంఇఒలు సురేష్ బాబు , జె రమణ, స్థానియ జెడ్‌పిహెచ్‌ఎస్ హెచ్‌ఎం శోభా రాణి తెలిపారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగే ఈ ఎంపిక పోటీలు కబడ్డీ, ఖోఖో, త్రో బాల్, బాల్ బ్యాడ్మింటన్, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, టెన్నికాయిట్, యోగా, అథ్లెటిక్స్ విభాగాల్లో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ ఎంపిక పోటీలు అండర్ - 14, అండర్ 17 బాల బాలికలకు నిర్వహిస్తున్నట్లు మండల ఎస్‌జిఎఫ్ ఇన్‌ఛార్జి గోపీనాథ్ తెలిపారు. ఈ పోటీలలో మండలంలోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల విద్యార్థులు పాల్గొనవచ్చని తెలిపారు.

మహారాజశ్రీ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు,కదిరి
O.S.NO:652/2019

Between:
1.బైతింటి అనిత,
2.బైతింటి సాయిపూజిత,
3.బైతింటి సాయికిరణ్ రెడ్డి ...Plaintiff
V/S
బైతింటి మధుసూధన్ రెడ్డి ...Defendant
To
బైతింటి మధుసూధన్ రెడ్డి S/o లేట్ బైతింటి లింగారెడ్డి, వయస్సు 45 సంవత్సరాలు, హిందూ, రాత్నాలపల్లి, H/o అల్లుగుండు, నల్లచెరువు మండలం, శ్రీ సత్యసాయి జిల్లా.

ప్రతివాదికి కోర్టు నోటీసులు
పై దావాలో వాదులు మీపై భాగపరిష్కారం కోసం దావా వేసి ఉన్నారు. ఈ దావాలో నిన్ను ప్రతివాదిగా చేర్చడమైనది. నీ హాజరు నిమిత్తం పై కోర్టులో 09/10/2023వ తేదిన వాయిదా వేసినారు. ఆ రోజు నీవు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ హాజరై ఆక్షేపనులు ఉన్న యెడల కోర్టు వారికి తెలుపుకోవాలని ఇందు మూలంగా తెలియజేయడమైనది.
(కోర్టు వారి ఉత్తర్వు మేరకు)
వాయిదా: 09/10/2023
స్థలం:కదిరి
కె.నాగేంద్ర రెడ్డి,బి.ఎ.,బి.ఎల్
వాదితరుపు న్యాయవాది, కదిరి

మహారాజశ్రీ గౌరవనీయులైన సీనియర్ సివిల్ జడ్జి కోర్టు,కదిరి
I.A.NO:19/2021 in O.S.NO:63/2016

Between:
S.M.రఫీ ...Petitioner/Plaintiff
And
S.M.D.సుకర్నో మరియు ఇతరులు ...Respondents/Defendants
R2)S.M.Dఫాతిమా W/o S.M.D.గౌస్, R/at D.No:13/2-85, రెవెన్యూ కాలనీ అనంతపురం సిటీ మరియు జిల్లా.

పై పిటీషన్ లోని 2వ ప్రతివాదికి నోటీసు
పై ఫైనల్ డిక్రీ పిటీషను పిటిసనర్ S.M.రఫీ వేసి ఉన్నారు. పై ఫైనల్ డిక్రీ పిటీషన్‌లో 2వ ప్రతివాది అయిన మీ హాజరు నిమిత్తం ఘనమైన కోర్టు వారు 29/09/2023వ తేదిన వాయిదా వేసినారు. కావున మీరు 29/09/2023వ తేదిన ఉదయం 10:30 గంటలకి స్వయముగా గానీ లేక వకీలు ద్వారా కానీ హాజరై ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకొనవలెను. లేనిచో ఘనమైన కోర్టు వారు పై పిటిషన్‌ని మీ పరోక్షముగా తీర్మాణించెదరు.
(కోర్టు వారి ఉత్తర్వు మేరకు)
వాయిదా: 29/09/2023
స్థలం:కదిరి
జి.గురులింగస్వామి,బి.ఎ.,బి.ఎల్
పిటిషనర్ తరుపు వకీలు, కదిరి

మహారాజశ్రీ గౌరవనీయులైన సీనియర్ సివిల్ జడ్జి కోర్టు,కదిరి
O.S.NO:34/2009

Between:
దాశెట్టి గంగులప్ప ...Plaintiff
And
సామల హనుమంతు రెడ్డి మరియు ఇతరులు ...Defendants
D8) రోషన్ బేగం W/o నరసింహా రెడ్డి, R/at ఎద్దులవాండ్ల పల్లి ఓబులదేవర చెరువు మండలం, శ్రీ సత్యసాయి జిల్లా.

పై దావాలో లోని 8వ ప్రతివాదిగా దావా సమన్లు
పై దావాలోని వాది దాశెట్టి గంగులప్ప 8వ ప్రతివాదిగా పై దావాలో మిమ్ములను చేర్చి ఉన్నారు. పై దావా ఘనమైన కోర్టు వారు 21/09/2023వ తేదిన వాయిదా వేసినారు. కావున మీరు 21/09/2023వ తేదిన ఉదయం 10:30 గంటలకి స్వయముగా గానీ లేక వకీలు ద్వారా కానీ హాజరై ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకొనవలెను. లేనిచో ఘనమైన కోర్టు వారు పై పిటిషన్‌ని మీ పరోక్షముగా తీర్మాణించెదరు.
(కోర్టు వారి ఉత్తర్వు మేరకు)
వాయిదా: 21/09/2023
స్థలం:కదిరి
జి.గురులింగస్వామి,బి.ఎ.,బి.ఎల్
పిటిషనర్ తరుపు వకీలు, కదిరి

మహారాజశ్రీ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు,కదిరి
O.S.NO:26/2013

Between:
పామిడి యూసుఫ్ సాబ్ ...Plaintiffs
And
పామిడి ఫీరాన్ సాబ్ మరియు ఇతరులు ...Defendants
D3) పామిడి ప్యారీమా బీ W/o లేట్ అయూబ్ సాబ్,
D5) పామిడి చాంద్ బాషా S/o లేట్ అయూబ్ సాబ్,
D6) పామిడి ఇర్ఫాన్ బాషా S/o లేట్ అయూబ్ సాబ్,
D7) పామిడి జిలాన్ బాషా S/o లేట్ అయూబ్ సాబ్,
D3,D5,to 7 are R/at D.No:1/46,గాండ్లపెంట గ్రామము మరియు మండలము, శ్రీ సత్యసాయి జిల్లా.
D8) షేక్ కుసుమిద బేగం W/o ఖాజా పీర్ D/o లేట్ అయూబ్ సాబ్ R/at కటకంవారి పల్లి, గాండ్లపెంట గ్రామము మరియు మండలము, శ్రీ సత్యసాయి జిల్లా.
D9) షేక్ రిజ్వాన W/o మహమ్మద్ రఫీక్ D/o లేట్ అయూబ్ సాబ్ R/at జీనులకుంట, గాండ్లపెంట గ్రామము మరియు మండలము, శ్రీ సత్యసాయి జిల్లా.
D10) పామిడి సలీమ W/o లేట్ మహబూబ్ బాషా, R/at D.No:1/46, గాండ్లపెంట గ్రామము మరియు మండలము, శ్రీ సత్యసాయి జిల్లా.
D11) షేక్ షబ్నమ్ W/o ముస్తాఫా D/o లేట్ మహబూబ్ బాషా, R/at D.No:4/08-2, కోట మాజిద్, తలుపుల గ్రామము మరియు మండలము, శ్రీ సత్యసాయి జిల్లా.
D12) పామిడి నవాజ్ S/o లేట్ మహబూబ్ బాషా,
D13) పామిడి షగుప్తా D/o లేట్ మహబూబ్ బాషా, శ్రీ సత్యసాయి జిల్లా.D11 and D12 are R/at D.No:1/46, గాండ్లపెంట గ్రామము మరియు మండలము, శ్రీ సత్యసాయి జిల్లా.

పై దావాలో D3,D5,D6,D7,D8,D9,D10,D11,D12,D13వ ప్రతివాదులుగా దావా సమన్లు
పై దావాలోని వాది పామిడి యూసఫ్ సాబ్ D3,D5,D6,D7,D8,D9,D10,D11,D12,D13వ ప్రతివాదులుగా పై దావాలో మిమ్ములను చేర్చి ఉన్నారు. పై దావాను ఘనమైన కోర్టు వారు 09/10/2023వ తేదిన మీ హాజరు నిమిత్తం వాయిదా వేసినారు. కావున మీరు 09/10/2023వ తేదిన ఉదయం 10:30 గంటలకి స్వయముగా గానీ లేక వకీలు ద్వారా కానీ హాజరై ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకొనవలెను. లేనిచో ఘనమైన కోర్టు వారు పై పిటిషన్‌ని మీ పరోక్షముగా తీర్మాణించెదరు.
(కోర్టు వారి ఉత్తర్వు మేరకు)
వాయిదా: 09/10/2023
స్థలం:కదిరి
జి.గురులింగస్వామి,బి.ఎ.,బి.ఎల్
పిటిషనర్ తరుపు వకీలు, కదిరి

పకడ్బందీగా జగనన్న ఆరోగ్య సురక్ష

సమావేశంలో పాల్గొన్న అధికారులు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

జగనన్న సురక్ష కింద సెప్టెంబర్ 30 నుండి అక్టోబర్ నెలాఖరు వరకు నిర్వహించే వైద్య శిబిరాల్లో రోగగ్రస్తులను గుర్తించి వైద్య సేవలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలనీ జిల్లా వైద్యాధికారి ఎస్‌వి. కృష్ణారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం జిల్లా వైద్య మరియుఆరోగ్య శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో స్టేట్ నోడల్ ఆఫీసర్, డిప్యూటీ డైరెక్టర్ శివ శంకర్ బాబు, వైద్యాధికారి ఎస్‌వి కృష్ణారెడ్డి, డిసిహెచ్‌ఎస్ తిపేంద్ర నాయక్. డిఎంఒలు బాబా ఫక్రుద్దీన్, కేసీ నాయక్, టిబి యూనిట్ ఆఫీసర్ డి తిప్పయ్య, డిఐఒ డాక్టర్ కృష్ణయ్య, డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ సెల్వియా షలోమన్, డాక్టర్ మంజువాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నోడల్ ఆఫీసర్ మాట్లాడుతూ, సెప్టెంబర్ ఒకటో తేదీ నుండి 15వ తేదీ వరకు గ్రామాల్లో ఎఎన్‌ఎంలు పర్యటించి పేషంట్ల జాబితా తయారు చేయాలని, సెప్టెంబర్ 16 నుండి 30 వరకు సచివాలయ వాలంటీర్లు ఇంటింటికి సర్వే చేసి ఎఎన్‌ఎంలు గుర్తించిన పేషెంట్ల వద్దకు వెళ్లి క్యాంపు వివరాలను తెలియ చేయాలని అన్నారు. సెప్టెంబర్ 30 నుండి సచివాలయ వారిగా హెల్త్ క్యాంపులు నిర్వహిస్తారని వాటిలో స్థానిక వైద్య సిబ్బందే కాక, ప్రైవేటు ఆసుపత్రుల వైద్యులు, ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రుల, ఐఎంఎ వంటి సంస్థల ఆధ్వర్యంలో స్పెషలిస్ట్ డాక్టర్లు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఈ మెడికల్ క్యాంపులో ఒపి సేవలు, అన్ని రకాలైన టెస్టులు ఖరీదైన మందులు అందజేస్తారని తెలిపారు. అవసరమైన వారికి జిల్లా ఆసుపత్రులలో ఆపరేషన్లు చికిత్సలు అందించేందుకు సిఫారసు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా లోని వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గాండ్లపెంట : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపిపి జగన్మోహన్ ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు, ఎంపీడీవో రాము నాయక్, వైద్యాధికారి మహేశ్వర్ మారుతి ఎంపిపి జగన్మోహన్ మాట్లాడుతూ 16వ తేదీ నుంచి గ్రామాలలో ప్రతి ఇంటికి వెళ్లి సర్వే చేసి ప్రజల ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకోవాలన్నారు. దీర్ఘకాలిక వ్యాధులున్న వారి వివరాలు నమోదు చేసుకొని 30వ తేదీ జరిగే వైద్య శిబిరాలకు పంపే విధంగా చూడాలని వారు తెలిపారు. ప్రభుత్వం ఉచితంగా వైద్య అందిస్తుందని వారు తెలిపారు ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ రామ్మోహన్, వైద్యాధికారి బాబాఫక్రుద్దీన్, వైద్య సిబ్బంది రవి కుమార్‌చ పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు

లేపాక్షి : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో నరసింహ నాయుడు అధ్యక్షతన ఆరోగ్య సురక్షపై అవగాహన కల్పించారు. ప్రతి పంచాయతీ పరిధిలో అధికారులు కలిసి కట్టుగా పనిచేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్నివిజయవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ఆనంద్ కుమార్, రామాంజనేయులు, మల్లికార్జున, ఎఎన్‌ఎంలు, సచివాలయాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి రూరల్ : ఆరోగ్య ఆంధ్ర ప్రదేశ్ లక్ష్యంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఆశాలకు, అంగన్వాడీ కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. పుట్టపర్తి మండలంలో సెప్టెంబర్ మూడవ తేదీ నుండి 13వ తేదీ వరకు జరిగే ఈ కార్యక్రమంలో ఆశలు, అంగన్వాడీలు ఇంటింటికి వెళ్లి ప్రజల ఆరోగ్య పరిస్థితి దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలు గుర్తించాలన్నారు. గుర్తించిన సమస్యలను ఆన్లైన్లో అప్లోడ్ చేసి వీటికి సంబంధించిన నిపుణులైన డాక్టర్లను క్యాంపులో అందుబాటులో ఉంటే వారికి చికిత్స జరిగేలా చూడాలన్నారు. డాక్టర్లు నాగరాజు నాయక్, నాగార్జున, జోష్న, వారికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రమణారెడ్డి, ఎంపీడీవో అశోక్ కుమార్ రెడ్డి, ఐసిడిఎస్ సూపర్వైజర్ భారతీయ దేవి, సిహెచ్ఒ నగేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభా విద్యార్థులకు చెక్కులు అందిస్తున్న వైద్యులు వెంకటరమణ

విద్యతో ఉజ్వల భవిష్యత్తు

ప్రజాశక్తి-హిందూపురం

విద్యతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యంతో చదువుకోవాలని ప్రముఖ చిన్నపిల్లల వైద్యులు వెంకట రమణ సూచించారు. మంగళవారం పట్టణంలోని అజీజీయా ఉర్దూ పాఠశాలలో ఇంగ్లీష్ క్లబ్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఇంగ్లీష్ అంశంపై వివిధ పోటీలను నిర్వహించి, ప్రతిభ చాటిన వారికి ప్రముఖ చిన్నపిల్లల వైద్యులు వెంకట రమణ చేతులు మీదుగా బహుమతులు అందించారు. అదే విధంగా ఈ సంవత్సరం ఇష్రత్, గత సంవత్సరం కౌసర్ పదవ తరగతిలో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించిన నేపథ్యంలో వారికి వైద్యులు తన సొంత నిధులతో ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం రంగనాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతిభా విద్యార్థికి అభినందన

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

పట్టణంలోని సాంస్కృతిక మండలిలో కూచిపూడి కళా కేంద్రం వారు నిర్వహించిన ఐదవ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా ఆలపించిన కర్నాటక సంగీతంలో ప్రతిభ కనపర్చిన విద్యార్థికి మున్సిపల్ చైర్ పర్సన్ కాచర్ల లక్ష్మి, సాంస్కృతిక మండలి వ్యవస్థాపకులు సత్రశాల ప్రసన్న కుమార్, సోలిగాళ్ళ వెంకటేశులు చేతుల మీదుగా జ్ఞాపికను అందజేశారు. పట్టణంలోని హెచ్.పీ గ్యాస్ ఏజెన్సీ గోవిందు చౌదరి మనవరాలు, అనంతశయన, కీర్తి చౌదరిల కుమార్తె లక్ష్మీ చౌదరి చేసిన కర్నాటక సంగీతాలాప ఆహుతులను ఆకట్టుకుంది. దీంతో ప్రతిభా విద్యార్థిని మున్సిపల్ చైర్మన్ కాచర్ల లక్ష్మి అభినందించారు. తల్లిదండ్రులు మాట్లాడుతూ తమ కుమార్తె ఐదు సంవత్సరాల వయసులోనే భారతీయ సంస్కృతి, కళలపై ఎంతో ఆసక్తి చూపేదన్నారు., చదువు అనంతరం వీటిపైన అభ్యసన చేసిందన్నారు.

లక్ష్మీ చౌదరికి జ్ఞాపికను అందించి అభినందిస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ కాచర్ల లక్ష్మి

ప్రజాసమస్యలపై మాట్లాడని బాలయ్య : వైసిపి

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ ఎప్పుడైనా ప్రజాసమస్యలపై మాట్లాడారా అని వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి దీపిక, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ ప్రశ్నించారు. మంగళవారం వైసిపి స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బాలకృష్ణ ఆయన బావను అరెస్టు చేస్తే విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతున్నారని ఎప్పుడైనా నియోజకవర్గ సమస్యలపై విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారా అని ప్రశ్నించారు. కనీసం శాసన సభ సమావేశ సమయంలో అయిన నోరు విప్పారా అని అన్నారు. ఆయన బావ చంద్రబాబు నాయుడును స్కీల్ స్కాంలో అరెస్టు చేస్తే నోరుందని కదా అని బరి తెగించి మాట్లాడితే చూస్తు ఉండరని అన్నారు. బాలయ్య చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. నియోజక వర్గ ప్రజలు రెండవ సారి బాలకృష్ణను ఎమ్మెల్యే గెలిపిస్తే ఆయన ఏం చేశారని ప్రశ్నించారు. సీఎం, పార్టీ గురించి నోరు జారితే రాష్ట్రంలో ఎక్కడిక్కడ అడ్డుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. చిన్న పాటి వర్షానికే పట్టణంలోని కొన్ని ప్రాంతాలు మునిగి పోవడమే బాలకృష్ణ చేసిన అభివృద్ధి అని ఎద్దేవా చేశారు. మానవతా దృక్పథంతో, పారదర్శకంగా పని చేస్తున్న జగన్మోహన్ రెడ్డిని విమర్శించే అర్హత బాలకృష్ణకు లేదన్నారు. ఈ సమావేశంలో వేణురెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మేన్ జబివుల్లా, కౌన్సిలర్లు షాజియా, రోషన్, రామచంద్ర, మాజీ ముత్వల్లీ కలీం తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న వైసిపి నాయకులు

భూ పంపిణీ చేయకపోతే ఉద్యమాలకు సిద్ధం

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

పేదలకు భూ పంపిణీ చేయకపోతే ఉద్యమాలకు శ్రీకారం చుడతామని రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం ఆవుల శేఖర్ హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని షాదీమహల్ లో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధమ మహాసభ నిర్వహించారు. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న శేఖర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాల వల్ల పేదలకు ఒరిగిందేమీ లేదన్నారు. నిరుపేదలకు భూ పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 50 లక్షల ఎకరాలు భూమి ఉందని ఆ భూమిని పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. ఈనెల 23, 24, 25 తేదీలలో రాష్ట్ర మహాసభలు బాపట్లలో జరుగుతాయని ఆ మహాసభలలో భూ పంపిణీకై తగు కార్యాచరణ ప్రణాళికలు రూపొందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి కేశవరెడ్డి, జిల్లా కార్యదర్శి గంగాధర్, జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు, ఉపాధ్యక్షులు రమణ, నాయకులు గంగరాజు, వెంకటనారాయణ, ఈశ్వరమ్మ, రమణమ్మ, ఆదిలక్ష్మి, లక్ష్మీదేవి, సిపిఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి-హిందూపురం

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి దీపిక అన్నారు. పురపాలక సంఘంలోని లక్ష్మిపురంలో మంగళవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో దీపికతో పాటు మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ తది తరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకటరమణ, మున్సిపల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బాలసుబ్రమణ్యం, వైస్ చైర్మన్ జబీవుల్లా, కౌన్సిలర్లు షాజియా, గిరి, నాగేంద్రబాబు, రహమత్ బి, మహిళా అధ్యక్షురాలు నాగమణి, నక్కలపల్లి శ్రీరామ్ రెడ్డి, సీపీసీ సాదిక్, మల్లికాభాను, డిష్ చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను అందజేస్తున్న దీపిక

ఇంటింటి సర్వే వంద శాతం పూర్తి : జేసీ

రాజకీయ నాయకులతో మాట్లాడుతున్న జేసీ చేతన్

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం నియోజకవర్గ వ్యాప్తంగా చేపట్టిన ఇంటింటి సర్వే వంద శాతం పూర్తి అయిందని జిల్లా జాయింట్ కలెక్టర్, నియోజక వర్గ ఎన్నికల అధికారి చేతన్ అన్నారు. స్పెషల్ సమ్మరి రివిజన్ - 2024లో భాగంగా నియోజవర్గ వ్యాప్తంగా ఉన్న అధికారులతో స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. అనంతరం వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు నియోజక వర్గ వ్యాప్తంగా నూతన ఓటరు నమోదుతో పాటు చేర్పులు...మార్పులపై వచ్చిన ధరఖాస్తులను బూత్ లెవల్ అధికారులు ఇంటింటికి వెళ్లి పరిశీలన చేసే కార్యక్రమం వంద శాతం పూర్తి అయిందన్నారు. వారి దృష్టికి వచ్చిన ప్రతి ఫిర్యాదును పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లాలో జనవరి 6, 2022 తేదీ నుంచి ఆగస్టు 9, 2023వ తేదీ వరకు వచ్చిన డెత్, షిఫ్టింగ్ కేసులు అన్ని రీవెరిఫికేషన్ చేయడం జరుగుతోందని, రీవెరిఫికేషన్ పై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులు అవగాహన పెంచుకోవాలని అన్నారు. బూత్ లెవెల్ ఏజెంట్లకు ఈ విషయమై అవగాహన కల్పించాలని సూచించారు. రీ వెరిఫికేషన్ కోసం మండలనికి ఒక స్పెషల్ ఆఫీసర్‌ను నియమించడం జరిగిందని. వారు నియోజకవర్గంలో 500 కేసులను పరిశీలన చేయడం జరిగిందని అన్నారు. అనర్హత కలిగిన ఓటర్ల తొలగింపు విషయమై ఎన్నికల నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. ఎటువంటి లోపాలకు ఆస్కారం లేకుండా పటిష్టమైన తుది ఓటర్ల జాబితాను రూపొందించేందుకు తగిన చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ విషయాలతో పాటు ఇతర విషయాల గురించి వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించి వివరించారు. ఈ కార్యక్రమాల్లో తహశీల్దార్లు హసీనా సుల్తాన, నాగరాజు, ఎంపిడిఒ నరేంద్ర కుమార్, ఇతర అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

బాలికల హక్కులపై అవగాహన

ప్రజాశక్తి - మడకశిర

నియోజకవర్గంలోని రొళ్ల మండలంలో ఆవినకుంట గ్రామంలో గల కెజిబివిలో బాలికల హక్కులు, బాల్యవివాహాలపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో పాల్గొన్న ఎంపిడిఒ ఆజాద్ మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న కార్యక్రమాలపై బాలికలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం నాగరాజు, ఎల్‌సి లక్ష్మీకాంత, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

డివిజన్ స్థాయి పోటీలకు చిలమత్తూరు విద్యార్థులు

ప్రజాశక్తి - చిలమత్తూరు

మండల పరిదిలోని కోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి పోటీలలో విజేతలుగా నిలిచిన పలువురు విద్యార్థులు డివిజన్ స్థాయికి ఎంపిక అయినట్లు మండల కో-ఆర్డీనేటర్ రామ్మూర్తి, ఎంఇఒ పద్మప్రియ, సల్మాన్‌రాజ్ తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులకు వారు శుభాకాంక్షలు తెలియజేశారు.జిల్లా స్థాయిలోను రాణించాలని ఆకాక్షించారు.

నేరాలు ఘోరాలు

మహిళపై దాడి.. బంగారు అభరణాలు చోరీ

కొత్తచెరువు : కొత్తచెరువు సమీపంలోని బుక్కపట్నం చెరువు కట్టమీద గుర్తుతెలియని వ్యక్తులు మహిళపై దాడి చేసి ఆమె వద్ద ఉన్న ఆభరణాలు చోరీ చేసి ఆమెను ముళ్ల పొదల్లోకి తోసేసి వెళ్లిన సంఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. ఈ ఘటనకు సంబందించి పోలీసులు తెలిపిన వివరాలు... తిరుపతికి చెందిన లక్ష్మీ అనే మహిళ కొద్ది నెలల కిందట పుట్టపర్తికి వలస వచ్చి హోటల్లో పని చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. ఈ నేపథ్యంలో ఈమెను ముదిగుబ్బకు చెందిన శ్రీనివాసులతో పరిచయం అయింది. సోమవారం శ్రీనివాసులు మహిళకు ఫోన్ చేసి బుక్కపట్నం చెరువు కట్ట వద్దకు రావాలని కోరాడు. దీంతో ఆమె అక్కడికి వచ్చింది. ఆసమయంలో ఆ ప్రాంతంలో ఎవరు లేనందున గుర్తు తెలియని వ్యక్తులు ఆమెపై దాడి చేసి గాయపరిచారు. ఆమె వద్ద ఉన్న బంగారు చైను, కమ్మలు, సెల్ ఫోను అపహరించారు. ఈసందర్భంగా ఈమెను ముళ్లపొదల్లో పడేసి వెళ్లారు. దీంతో ఆ మహిళ రాత్రంతా ముళ్లకంపల్లోనే అరుచుకుంటూ ఉండిపోయింది. మంగళవారం ఉదయం ఆ దారి వెంట వెళ్తున్న రైతులు ఆమె అరుపులు విని పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి మహిళకు ముళ్లకంపల్లో నుంచి బయటకు తీసి 108 లో ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ లింగన్న తెలిపారు

మట్కా నిర్వాహకుడు అరెస్టు

మడకశిర రూరల్ : మడకశిర పట్టణంలోని ఆర్యపేటలో మట్కా నిర్వాహకులపై పోలీసులు మంగళవారం దాడులు నిర్వహించారు. మట్కా నిర్వాహకుడు మసాజ్ చారిని అరెస్ట్ చేసి స్టేషన్ కు తరలించారు. రూ. 11,340నగదు, మట్కా పేపర్లు స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ లోకేష్ తెలిపారు.

నర్సరీ నిర్వాహకుడు ఆత్మహత్య

ముదిగుబ్బ : అప్పులబాధ తాళలేక మండల కేంద్రంలో నర్సరీ నిర్వహిస్తున్న వ్యక్తి పురుగులు మందు తాగి మృతి చెందిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. మండల కేంద్రంలోని టీచర్స్ కాలనీకి చెందిన రామకృష్ణయ్య (52) కదిరి రోడ్డులో వెజిటేబుల్ నర్సరీ నిర్వహిస్తున్నాడు. ఈనేపథ్యంలో తన కూతురు పెళ్లికి, నర్సరీనిర్వహణకు దాదాపు రూ. 12 లక్షల దాకా అప్పులు చేశాడు. నర్సరీ సరిగా జరగనందున, అప్పులు ఎలా తీర్చాలోనని మధన పడుతూ ఉండేవాడు. ఈనేపథ్యంలో సోమవారం రాత్రి బజారుకు పోయి వస్తానని చెప్పి ఇంటి నుండి వెళ్లిన రామకృష్ణయ్య కదిరి రైల్వే గేట్ సమీపంలో పురుగుల మందు తాగి అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించడం తో 108 వాహనంలో బత్తలపల్లి ఆర్‌డిటి ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న రామకృష్ణయ్య మంగళవారం మృతిచెందాడు. మృతుడు ముదిగుబ్బ పోస్టాఫీసులో జిడిఎస్ పోస్ట్‌మ్యాన్‌గా కూడా పనిచేస్తుండేవాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ముదిగుబ్బ : మండల పరిధిలోని జొన్నల కొత్తపల్లి సమీపంలో ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ద్విచక్ర వాహనం ఢీకొన్న ప్రమాదంలో వ్యక్తికి గాయాలు అయ్యాయి. అనంతపురంవైపు నుండి కదిరి వైపు వెళుతున్న ద్విచక్ర వాహనం, జొన్నల కొత్తపల్లి సమీపంలో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి నిలబడిన ట్రాక్టర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనదారుడైన నల్లచెరువు మండలం దామండ్లపల్లికి చెందిన సురేంద్రకు గాయాలయ్యాయి.

ద్విచక్ర వాహనాలు దగ్ధం

హిందూపురం : పట్టణంలోని అబాద్ పేటలో ఇంటి ముందు నిలబెట్టిన నాలుగు ద్విచక్ర వాహనాలకు మంగళవారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టారు. ఈ మంటల్లో ఆ నాలుగు ద్విచక్ర వాహనాలు కాలి బూడిదయ్యాయి. ఈ విషయంపై ద్విచక్ర వాహనదారుల యజమానులు వన్ టౌన్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు.

బాలుడు మృతి

ఆసుపత్రి వద్ద బంధువుల ఆందోళన

ప్రజాశక్తి-మడకశిర

తీవ్ర జ్వరంతో బాధపడుతూ తొమ్మిదేళ్ల బాలుడు మృతి చెందాడు. కాగా బాలుని ఆరోగ్య పరిస్థితి గురించి తమకు చెప్పకుండా వైద్యుడు కాలయాపన చేయడం వల్లే చిన్నారి మృతి చెందాడని ఆరోపిస్తూ కుటుంబ సభ్యులు ప్రయివేటు ఆసుపత్రి వద్ద ఆందోళనకు దిగారు. బాధిత చిన్నారి కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. గుడిబండ మండలం సంకరగళ్లు గ్రామానికి చెందిన బాదిపల్లెప్ప మనవడు(తొమ్మిది నెలల బాలుడు) జ్వరంతో బాధపడుతున్నాడు. బాలున్ని చికిత్స నిమిత్తం మంగళవారం ఉదయం మడకశిర పట్టణంలోని అరవింద థియేటర్ సమీపంలో ఉన్న చిన్నపిల్లల ఆసుపత్రి వద్దకు తీసుకెళ్లారు. అక్కడ డాక్టర్ బాలున్ని పరీక్షించి, సిరప్ ఇచ్చి పంపాడు. సాయంత్రం రావాలని వైద్యుడు వారికి చెప్పాడు. ఆయన చెప్పిన మేరకు సాయంత్రం బాలున్ని తీసుకుని ఆసుపత్రికి వచ్చారు. అప్పటికే బాలుని పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుడు మెరుగైన వైద్యం కోసం ఇతర ప్రాంతానికి తీసుకెళ్లాలని చెప్పాడు. ఇలా కొన్ని నిమిషాల వ్యవధిలోనే బాలుడు కన్నుమూశాడు. దీంతో ఆగ్రహానికి లోనైన బాలుని కుటుంబ సభ్యులు ఆసుపత్రి వద్ద ఆందోళనకు దిగారు. బాలుని ఆరోగ్య పరిస్థితిని గుర్తించకుండా వైద్యుడు సాయంత్రం వరకు ఉండమని చెప్పడం వల్లే తమ కుమారుడు మృతి చెందాడంటూ తల్లిదండ్రులు విలపించారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని బాధితులతో మాట్లాడారు. వారికి సర్ధిచెప్పి అక్కడి నుంచి పంపించారు.

రాష్ట్రస్థాయి జట్టుకు బత్తలపల్లి విద్యార్థిని ఎంపిక

బత్తలపల్లి : ఫుట్‌బాల్ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్స్ అండర్-13 బాలికల జట్టులో బత్తలపల్లి బాలికల ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న శిల్పా సుబ్రహ్మణ్యేశ్వరి స్థానం సంపాదించుకున్నట్లు కోచ్ దుర్గాప్రసాద్ తెలిపాడు. శిల్ప శ్రీసత్యసాయి జిల్లా తరుపున కెప్టెన్ గా వ్యవహరించి రాష్ట్ర స్థాయిలో టోర్నమెంట్లలో జిల్లా జట్టును మూడో స్థానంలో నిలిపిందన్నారు. ఈ నెల 15వ తేదీ నుంచి 29వ తేదీ వరకు నేషనల్ ఛాంపియన్ షిప్ పోటీలు కర్నాటక రాష్ట్రంలోని బెల్గాంలో జరుగుతాయని ఈ పోటీల్లో శిల్ప తన ప్రతిభ కనబర్చాలని ఆకాంక్షించారు. రాష్ట్ర జట్టులో స్థానం సంపాదించుకోవడంతో శిల్ప తన కలను సహకారం చేసుకుందన్నారు.

భవననిర్మాణానికి స్థలం కేటాయించండి

తలుపుల : భవన నిర్మాణరంగ సంఘం భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం గౌరవాధ్యక్షులు చింతకుంట కృష్ణారెడ్డి (డీకే బాబు) కోరారు. ఈ మేరకు ఆయన కార్మికులతో కలసి స్థానిక తహశీల్దార్ శ్రీధర్‌కు బుధవారం వినతి పత్రం అందజేశారు. అనువుగా ఉన్నచోట ప్రభుత్వ భూమిని పరిశీలించి స్థలం కేటాయిస్తామని తహశీల్దార్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్మిక సంఘం అధ్యక్షులు మహబూబ్ బాషా కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేయాలి : ఎస్పీ

పుట్టపర్తి రూరల్: నిబద్ధతతో పనిచేసి పోలీస్ శాఖకు ప్రజల్లో మంచి నమ్మకం కలిగే విధంగా వ్యవహరించాలని, శ్రీ సత్య సాయి జిల్లాఎస్పీ ఎస్వీ మాధవ్ రెడ్డి సూచించారు. శ్రీ సత్య సాయి జిల్లాలో ఇటీవల సీఐల బదిలీలు జరిగాయి. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని ఎస్పీ చాంబర్లో బదిలీ అధికారులు ఎస్పీని కలిశారు. కదిరి రూరల్ సీఐ గా బాధ్యతలు చేపట్టిన వెంకటేశ్వర్లు, హిందూపురం, రొద్దం సిఐ, ఎస్ఐలుగా బాధ్యతలు స్వీకరించిన అధికారులు ఎస్పీ ఎస్వీ మాధవ్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాధవ్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ అసాంఘిక కార్యకలాపాలు పూర్తిగా రూపుమాపే దిశగా పోలీసులు అడుగులు వేయాలన్నారు. నిబద్ధతతో పనిచేసి ప్రతి పోలీస్ అధికారి మంచి పేరు తెచ్చుకోవాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా బాధ్యతలు స్వీకరించిన సిఐలను కార్యాలయంలో అభినందించారు.

సిఐను అభినందిస్తున్న ఎస్పీ